# నిజస్వరూపాలు

మదిర భానుమూర్తి



**అప్పటికే** ఆ కంపార్ట్‌మెంట్ అంతా జనంతో కిటకిటలాడి పోతోంది. ప్లాట్ ఫారం మీద ఇసుక వే స్తే రాలనంత జనం. ఆ జనాన్ని తోసుకుంటూ ఒక పెద్ద మనిషి లోపల ప్రవేశించాడు. అతని చొరవ అందరినీ ఆకర్షించింది.

గేటు దగ్గర నిలబడి ఉన్న జనాన్ని ఉద్దేశించి "సర్దుకోరేం— లోపలికి?... ఎక్కిన వాళ్ళంతా గేటు దగ్గరే నిలబడిపోతే మిగిలిన వాళ్ళు లోపలికి ఎలా వస్తారు ?... సర్దుకోండి !..." అన్నాడు.

"లోపల జాగా లేందే సర్దుకోవడం ఎలాగ?" అన్నాడు గేటు దగ్గర నుంచున్న వాళ్ళలో ఒకడు.

"జాగా మన కోసం సిద్ధంగా ఉండదు— మనం సర్దుకుంటే వస్తుంది..." అన్నాడు పెద్ద మనిషి.

"అయితే! మీరు సర్దుకుని లోపలికి వెళ్ళండి..." అని మరొకరు అనగానే- "అలా అన్నారు- బాగుంది! ... కొంచెం జరగండి. బాబూ- సర్దుకోండి !... ఎవరిది ఈ సామాను ? ... ఇది పైన బల్లల మీద పెట్టక ఇలా క్రింద పేర్చే స్తే ఇంక రైల్లో జాగా ఎక్కడుంటుంది ?" - అంటూ కొందరిని డబాయించి. మరి కొందరిని బ్రతిమాలి. నెమ్మదిగా చోటు చేసుకుని లోపలికి ప్రవేశించాడు. ఒక బెంచీ మీద మూ లగా కూచున్న మునలాయన మూ ట పైన బల్ల మీద పెట్టి. ఆ జాగాలో తాను కూచున్నాడు.

కొంచెం స్తిమితపడ్డాక బహిరంగ సభలో ఉపన్యసిస్తున్నట్లుగా "అబ్బబ్బబ్బబ్బబ్బ ! ... మనం ఇంక ఎప్పుడు బాగుపడతామో నాకేం అర్థం కావడం లేదు... దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలయినా. ఇంకా మనం రైలు ఎక్కటమే నా నేర్చుకోలేదు ! ప్రజల్లో మార్పు రానంత కాలం దేశాన్ని బాగు చెయ్యాలని ఎంత తాపత్రయ పడితే మాత్రం ఏం లాభం ?... ఎక్కువ రైళ్ళు వే స్తే సమస్యలు తీరవు... వేసిన వాటిని సద్వినియోగం చేసుకోవడం నేర్చుకోవాలి !... అబ్బా !... ఎంత ఉక్కగా ఉంది !... ఫ్యాన్లు వెయ్యండి. బాబూ !" అన్నాడు ఆ పెద్ద మనిషి చేతిలోని న్యూస్ పేపరుతో విసురుకొంటూ.

"ఈ పెట్టెలో ఫ్యాన్లూ లేవు. స్విచ్చిలూ లేవు ! ... అవి బిగించిన ఆనవాళ్ళున్నా యంతే !..." అని జవాబు వచ్చింది.

"అయిందీ ? ... ఆ సంబరమూ అయిందా ?.... అంతేనండీ !... మనం అంతే ! ... మనకి ఎన్ని సదుపాయాలు చేసినా అంతే ! చేసే సదుపాయాలు చేస్తూండగానే ఒక్కొక్కటే తీసుకుపోతే ఎలాగ — చెప్పండి ? ... బల్బులు పీకేస్తారు ?... ఫ్యాన్లు విప్పుకు పోతారు ? ... పరుపులు కోసేస్తారు ?... అద్దాలు మాయం చే సేస్తారు ? ఎలాగ ? - ఇలా గయితే ఎలాగ ?..." అని తన కెదురుగా ఉన్నాయన కేసి చూస్తూ అన్నాడు.


అవతలాయన కంగారు పడి. "అవ్వి ఏమయ్యో నే నెరుగనండీ !... నే నింతకు ముందు స్టేషన్లోనే రైలెక్కాను- వచ్చే స్టేషన్లో దిగిపోతాను..." అన్నాడు తన నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకునే యత్నంలో అమాయకంగా.

అందరూ నవ్వారు. పెద్ద మనిషి కూడా నవ్వి. "మీరంటే మీరని కాదండీ!... అసలు మన వాళ్ళ పరిస్థితి చెప్పాను... జనం ఇలా ఉంటే కొత్త సదుపాయా లేవైనా చెయ్య బుద్ధి పుడుతుందా ?- ఏమంటారు ?" అన్నాడు - రైల్వే వారు చేస్తున్న సదుపాయాలన్నీ తానే చేస్తున్నట్లుగా.

ఇంతలో ఆ పెట్టెలోకి ప్రవేశించిన ఒక చీపుగా ని గొంతు వినవచ్చింది. "ఈ ఉన్న వాళ్ళు చాలరన్నట్లు వీళ్ళొకళ్ళు !" అని విసుక్కున్నా డొక ప్రయాణీకుడు.

"అమ్మమ్మమ్మ ! - అలా అనకండి... ఈ దేశం వాళ్ళది !... ఈ రైళ్ళు వాళ్ళ సొంతం !... అందుచే






త వాళ్ళు టిక్కట్లు కొనక్కర్లేదు !... వాళ్ళు ఎక్కాక జాగా ఉంటేనే టిక్కట్లు కొనుక్కున్న మన లాంటి వాళ్ళు రైళ్ళెక్కాలి !..." అని మరొక ప్రయాణీకుడు వ్యాఖ్యానించి, తన తెలివికి తానే మురిసిపోయి, విరగబడి నవ్వాడు. కాని ఇంక ఎవ్వరూ నవ్వకపోయేసరికి అర్ధాంతరంగా తానూ నవ్వు ఆపేశాడు.

"పిల్లలు గల వాణ్ణి !... తమకు తోచిన సాయం చెయ్యండి, బాబూ !..." అని ముష్టివాడు ఒక్కొక్క ప్రయాణీకుని దగ్గరకే వచ్చి అడుగుతుంటే, "అసలే జాగా లేక ఇబ్బంది పడుతుంటే ఇంకా లోపలికి చొరబడతా వెందుకు ?... అక్కణ్ణించి అడుగు - వేసే వాళ్ళుంటే వేస్తారు !..." అన్నా డింకొక ప్రయాణీకుడు - విసుగ్గా.

"ఇది చాలా సులువైన వృత్తి అయిపోయింది ఈ రోజుల్లో !" అని ఒకరంటే- "పెట్టుబడి అక్కర్లేని వ్యాపారం మరి !..." అని మరొక రన్నారు.

మూల కూచున్న పెద్ద మనిషి కళ్ళజోడు అద్దాలు శుభ్రం చేస్తూ, "ఇందాకటి నుంచి చూస్తున్నాను... ఆ ముష్టి వాణ్ణి అందరూ విమర్శించే వాళ్ళే గాని, ఒక్క పైసా అయినా వేసిన వాళ్ళు లేరు ... ముష్టెత్తుకునే వాళ్ళూ మనలాంటి వాళ్ళేనండీ !... ఎటొచ్చీ వాళ్ళు దురదృష్టవంతులు కనుక ముష్టి ఎత్తుకుంటున్నారు !... మన అదృష్టం బాగుంది !... అంతే తేడా !... మనకి ఉన్నంతలో తోటి వాడికి సాయపడటం నేర్చుకోవాలి !- అంతేగాని, వెక్కిరింతలూ వేళాకోళాలూ కాదు !... మన దేశంలో జనాభా పెరిగినంత జోరుగా ఉద్యోగాలు పెరగడం లేదు... అందుకే నిరుద్యోగు లెక్కువవుతున్నారు... అందరూ ఉద్యోగాలకే ఎగబడితే ఎలాగ ?- ఎవరికి వారు ఏదైనా ఉపాధి చూసుకోవాలి గాని..." అంటూ ఉపన్యాస ధోరణిలో అన్నాడు - ఈ దేశపు సమస్యల నన్నింటినీ పరిష్కరించే భారం తన ఒక్కడి మీదే ఉన్నట్టుగా !...

ముష్టి వాని పట్ల అంత సానుభూతిని ప్రదర్శించిన ఆ పెద్ద మనిషి మాత్రం అతని కేమీ ఈయలేదు. మళ్ళా అందుకుని, "అసలు మన వాళ్ళకి ఏ విషయాన్ని గురించీ సరైన అవగాహన లేదు..." అంటూ ఉపన్యాసాన్ని ప్రారంభించి అర్ధాంతరంగా ఆపివేశాడు.

అలా ఎందుకు చేశాడో అర్థం కాక అతడు చూస్తున్న దిక్కుగా నేనూ చూశాను. అక్కడ టిక్కట్టు కలెక్టరు ముష్టి వాణ్ణి టిక్కట్టు చూపించమని అడుగుతున్నాడు. ముష్టి వాడు బనీను జేబు లోంచి సీజను టిక్కట్టు తీసి చూపించాడు. అది చూడగానే అంతవరకూ ముష్టి వాణ్ణి టిక్కట్టు లేని ప్రయాణీకునిగా జమకట్టి వ్యాఖ్యానించిన వాళ్ళంతా అవాక్కయిపోయారు.

పెద్ద మనిషి ఈసారి ఏమీ మాట్లాడలేదు.

"అయితే, సీజన్ టిక్కట్టు కొనుక్కుని మరీ ముష్టి ఎత్తుకుంటాడన్నమాట..." అని ఒక ప్రయాణీకు డన్నాడు.

"అవునండి ... ఇతను చాలా నిజాయితీ అయినవాడు. .. ఒకసారి పై అధికారి అవినీతిని బయట పెట్టినందుకు ఆయన ఆగ్రహించి, ఒక దొంగతనం కేసు ఇతని మీద బనాయించి, ఉద్యోగం ఊడగొట్టించి జైలుకి పంపించాడు. చెయ్యని నేరానికి శిక్ష అనుభవించి వచ్చాక తప్పని సరయి ఈ వృత్తిలోకి దిగాడు - పాపం !... ఎన్నడూ టిక్కట్టు లేందే రైలు ఎక్కడు..." అని టిక్కట్టు కలెక్టరు ముష్టి వాణ్ణి గురించి చెప్పాడు. అది విన్న ప్రయాణీకులు కొందరు ముష్టి వానికి యథాశక్తి సహాయం చేశారు. ఆ పెద్ద మనిషి మాత్రం ఏమీ ఈయలేదు.

టిక్కట్టు కలెక్టరు ఒక్కొక్కరి దగ్గరే టిక్కట్టు చూస్తున్నాడు.

"ఏమండోయ్ !!!! అప్పారావు గారూ !... కులాసాగా ఉన్నారా ?..." అని టిక్కట్టు కలెక్టరుని పలకరించాడు పెద్ద మనిషి.

టిక్కట్టు కలెక్టరు జవాబేమీ చెప్పలేదు.

"మిమ్మల్నేనండీ, టిక్కట్టు కలెక్టరు గారూ కులాసానా ?!!!" అని రెట్టించాడు పెద్ద మనిషి.

"ఓ !... నన్నా !... నా పేరు అప్పారావు కాదే అన్నాడు టిక్కట్టు కలెక్టరు.

"అవును... అప్పారావు గా రింకొకాయన... ఆఁ! మీ పేరేమిటన్నారూ?..."

"నేనేమీ అనలేదే !..."

"పోనీ, ఇప్పుడనండీ!..."

"నా పేరేదయితే ఏం లెండి ? టిక్కట్టు కలెక్టరనండి — చాలు!... మీ టిక్కట్టు చూపించండి !..."

"అబ్బో !... అబ్బో!... ఎంత చమత్కారులండీ పేరు చెప్పకుండా దాటే సేస్తున్నారు... అసలు నేను గుర్తున్నానా మీకు ?..." అని అడిగాడు పెద్ద మనిషి.

"క్షమించండి !... మీ రెవరో నేనెరుగను... మీ టిక్కట్టు చూపించండి... నా కింకా చాలా పనుంది...." అన్నాడు టిక్కట్టు కలెక్టరు సీరియస్‌గా.

"అవున్లెండి ! ... రోజూ మా లాంటి వాళ్ళని బోలెడు మందిని చూస్తుంటారు - మీరు ! ... అందరూ గుర్తుండాలంటే సాధ్యమా ?..." అని పెద్ద మనిషి అనేసరికి - "టిక్కట్ ప్లీజ్ !" అని విసుగ్గా అడిగాడు టిక్కట్టు కలెక్టరు.

పెద్ద మనిషి ముఖం అదోకలాగా పెట్టి, "అన్నట్టు మీకు నా టిక్కట్టు చూపించలేదు కదూ ?... మిమ్మల్ని చూడగానే మన పాత స్నేహం గుర్తుకు వచ్చి ఆ 'ఇది' లో ఉండి పోయాను..." అంటూ లాల్చీ జేబులు వెదికాడు. పర్సు తీసి చూశాడు. జేబురుమాలు, కండువా మడతలు విప్పి దులిపాడు. అన్నీ మరోసారి చూసి టిక్కట్టు కలెక్టరుతో "ఏమండీ !... నా టిక్కట్టేదీ ?..." అన్నాడు.

"అదే నేను మిమ్మల్ని అడుగుతున్నాను..." అన్నాడు టిక్కట్టు కలెక్టరు.

"అయితే, నా టిక్కట్టు మీ కివ్వ లేదన్న మాట ఏమయింది చెప్మా !... కొన్న టిక్కట్టు ఈ జేబులోనే పెట్టాను - తీరా మీ రడిగే సరికి లేదేమిటి ?... ఏమైనట్టు?..." అన్నాడు పెద్ద మనిషి.

"ఇదేం నాటకమా ?... టిక్కట్టుంటే చూపించండి !... లేకపోతే డబ్బు కట్టండి !..." అని గదమాయించాడు టిక్కట్టు కలెక్టరు.

"ఉండండి ! ... అదే చూస్తున్నాను... తాత గారూ ?... నా టిక్కట్టు మీకేమైనా ఇచ్చానా ?..." అని ప్రక్కనున్న ముసలాయన్ని అడిగాడు పెద్ద మనిషి.

"ఇది బాగుంది... మీ టిక్కట్టు నాకు ఎందుకిస్తారు ?..." అన్నాడు ముసలాయన.

"ఏమండీ ! ... మీకో!..." అన్నాడు ఎదుటి సీట్లోని వ్యక్తి నుద్దేశించి.

"ఇది ఇంకా బాగుంది..." అన్నా డాయన.

"అయితే, నా టిక్కట్టు మీ ఎవరి దగ్గరా లేదన్న మాట !... ఆశ్చర్యంగా ఉందే!..." అన్నాడు పెద్ద మనిషి.

"అయితే, ఇది టిక్కట్టు లేని బాపతన్న మాట ! అందుకా నాతో పరిచయ మున్నట్టు యోగక్షేమాల డిగారు ?... సరే!... డబ్బు కట్టం డిక !..." అన్నాడు టిక్కట్టు కలెక్టరు. అందరూ గొల్లుమన్నారు.

"ప్రస్తుతం నా దగ్గర డబ్బు లేదండీ !... అయినా ... నా టిక్కట్టు ..." అని పెద్ద మనిషి ఇంకా ఏదో అనబోతూ ఉంటే- "రండి ! ... నాతో రండి !... స్టేషనొచ్చింది! ... మీ టిక్కట్టు ఇక్కడ స్టేషను మాస్టరు దగ్గర కానీ, పోలీసు స్టేషన్లో కాని ఉందేమో కనుక్కుందాం !- రండి !" అన్నాడు టిక్కట్టు కలెక్టరు.

"అంతే నంటారా ?..." అన్నాడు పెద్ద మనిషి జాలిగా.

"ఒక్కొక్కళ్ళ దగ్గర ఇంతంత సేపయితే నా పని అయినట్టే !... రావయ్యా - ఇంక నాటకా లాపి, అని గదమాయించాడు టిక్కట్టు కలెక్టరు.

మారు మాటాడకుండా రైలు దిగి వెడుతున్న పెద్ద మనిషిని చూసి, "మనం ఇలా ఉంటే దేశం ఇంక ఎలా బాగుపడుతుంది? - వెళ్ళిరండి అన్నారు కంపార్ట్‌మెంటులోంచి ఒకరు.

"అబ్బ !... ఎన్ని ధర్మపన్నాలు చెప్పాడు? - ఆ ముష్టి వాడిపాటి నీతి లేకపోయింది..." అన్నాడు ముసలాయన.

అంతా ఆ పెద్ద మనిషి వెడుతున్న వైపే చూశారు. ★